# అమ్మా! ఇది అనంతం!

సమయం : షికారెళ్ళిన మగవాళ్ళు గూళ్ళకి చేరేవేళ

స్థలం : రైల్వేస్టేషన్

సందర్భం : స్నేహితులకి సెండాఫ్

అప్పుడే సర్కార్రొచ్చి వెళ్ళిపోయింది. లగ్నం అయిపోయిన పెళ్ళిపందిరిలా వుంది ప్లాట్‌ఫారం. ఓవర్ బ్రిడ్జి ఎక్కడం, ఎక్కితే దిగడం మహా ఎలర్జీ మా ఫ్రెండుకి. మేము ఊళ్ళోకి వెళ్ళాలంటే మూడు ప్లాట్‌ఫారాలు దాటాలి. మరంచేత అతన్తో పాటు నేనూ రైలు పట్టాలు క్రాస్ చేస్తూ నడవక తప్పలేదు. ఆఖరి ఫ్లాట్‌పారం అవతల ఓ ఆగిన రైలుంది. చుట్టూ చీకటి. బహుశా అది మర్నాటి వరకు బైల్దేరదేమో! ఇంత చీకట్లో ఈ రైలుకి ప్రదక్షిణం చెయ్యడం ఎందుకు? ఏదో ఓ పెట్టెలో యిట్నుంచి ఎక్కి అట్నుంచి దిగేద్దాం అన్నాడతను. ప్లాట్‌ఫాం లేచిచోట రైలెక్కడం ఆడవాళ్ళకి కష్టం, అయినా పరువుకోసం సరేనన్నాను.

ముందుగా అతనే ఎక్కేడు.

"పదిహేను రూపాయలు" అంది పెట్టెలోని ఆడగొంతుక.

ఎక్కబోతున్న నా కాలు భయంతో బిగుసుకుపోయింది.

రైల్లో కూడా దయ్యాలుంటాయా?

"పదండి ఓవర్ బ్రిడ్జి ఎక్కేద్దాం" అంటూ అతను గాభరాగా దిగేసేడు.

దూరంగా ప్లాట్‌పారం మీదున్న లైట్ల వెల్తురు కిటికీలోంచి పడినందువల్ల ఆ పెట్టెల్లో ఏవో ఆకారాలు తిరుగుతూ దయ్యాల నీడల్లా కనిపించేయి.

కొన్ని జతల గాజుల గలగల, వాటి వెనుక నవ్వులు వినిపించేయి మా వెనుక.

నాకు సంగతి అర్థం అయింది. అందులో నీరజ వుంది, నిర్మల కూడా వుండే వుంటుంది. సుందరీ, సుశీలా, మరకతం, వగైరా....

అది ఆగివున్న రైలుపెట్టె అయినా, పరిగెడుతున్న పాంటియాక్ కారైనా తాటాకు గుడిసైనా, తాజ్‌మహల్ హోటలైనా కథ ఒక్కటే.

❖ ❖ ❖

మనిషిగా పుట్టడం ఒక్కటే ప్రేమించడానికి అర్హత అయితే నీరజ నిరంజనాన్ని ప్రేమించింది.

ప్రేమ పరమ పవిత్రమైనదనీ, దాన్ని కాదనే అధికారం ఎవరికీ లేదనీ హిందీ సినిమాలు చూసి, తెలుగు నవలలు చదివీ తెగనమ్మేసింది. ఆ నమ్మకంతోనే అతన్ని పూర్తిగా నమ్మింది. నీరజకి నా అన్న వాళ్ళెవరూ లేరు ఒక్క నాన్నతప్ప. నాన్నది నాది అది చెప్పుకోవడానికి నీరజ కాక, నెలకి నూటాయాభై రూపాయల ఉద్యోగం ఉంది.

నీరజ, నిరంజనాల ప్రేమ అన్ని ప్రేమ వ్యవహారాల్లాగే ఊరంతా తిరిగి ఆఖరికి నీరజ నాన్న దగ్గర ఆగింది. ఊరందర్నీ ఉగ్రూతలూగించిన విషయం అతనికేం ఆశ్చర్యం కలిగించలేదు. నిరంజనం చదువుకున్నవాడు, ఉద్యోగం చేసుకుంటున్నాడు. బుద్ధిమంతుడు, పైగా వాళ్ళిద్దరూ వయసులో వున్నారు తప్పేవిఁటి? అనుకున్నాడు ఆ అమాయకపు తండ్రి.

ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లల్ని అవసరమైన దానికంటే కూడా ఎక్కువే నమ్ముతారు.

ఎన్నాళ్ళిలా? పెళ్ళి చేసేసుకుందాం అంది నీరజ.

పెళ్ళిని ఆడది వీలైనంత వేగంగాను, మొగాడు వీలైనంత ఆలస్యంగా చేసుకోవాలనుకుంటాడు.

దానికేం, మా అమ్మా, నాన్నలతో చెప్పివస్తానన్నాడతను.

చెప్పేడు.

"నేను నీరజని పెళ్ళి చేసుకుంటున్నాను"

"తథాస్తు" అన్నారు అమ్మా, నాన్న.

నమ్మకం కలగలేదు నిరంజనానికి.

"మన కులం కాదు" అన్నాడు బెదుర్తూనే, యీసారి కాదంటారేమో అన్న నమ్మకంతో

"మాకు కులం అక్కర్లేదు" అన్నారు.

నమ్మక తప్పలేదు అతనికి.

"నిన్ను చిన్నప్పటి నుంచి పెంచి పెద్దచేసి చదువు చెప్పించి యింతవాడ్ని చేశేవా?" అన్నాడు నాన్న.

"మరి ఆ డబ్బు ఏ బేంకులోనో వేసుకుంటే వడ్డీతో బతకొచ్చు" అంది తల్లి.

"మరంచేత కనీసం పాతికవేలయినా యిమ్మను నీ మామ

గార్ని. మామూలుగా అయితే నీకు రేటు బాగానే పలుకుతుంది. నీక్కావల్సిన పిల్ల కదా, అది చాల్లే" అన్నారిద్దరూ.

వాళ్ళకోరిక ఎందుకోగాని న్యాయంగా తోచింది అతనికి. తన కోరిక వాళ్ళు ఒప్పుకున్నప్పుడు వాళ్ళ కోరికని కాదనడం అధర్మం అనుకున్నాడు.

"అధర్మం" అని గట్టిగా అరిచింది నీరజ అంతా విని. అన్యాయం, అక్రమం అని కూడా కలిపింది. మా నాన్న మాత్రం నన్ను పెంచలేదా? చదివించలేదా? మరి అతనెవర్ని అడుగు తాడు ఆ డబ్బుని? అసలు ఎవరి పిల్లల్ని వాళ్ళు పెంచుకోవడం ఊరికి ఉపకారమా? పోనీ అన్నీ ఒప్పుకున్నా పాతికవేలు మా నాన్న ఎక్కడినుంచి తెస్తాడనుకున్నావ్? అని దులిపేసింది.

నీకు పాతికవేలు కావాలో, నేను కావాలో నిర్ణయించుకో మంది.

"నాకు నువ్వే కావాలి. పాతికవేలు మా నాన్నకి" అన్నాడు తను నీరసంగా.

"అయితే నేను అంత డబ్బు తెచ్చేవరకు ఆగు డబ్బుతో నేనే వస్తాను" అంది, "మా నాన్న డబ్బువద్దు. నిన్నిపుపడే చేసుకుం టాను" అని అంటాడన్న ఆశతో.

కాని నిరంజనం ఏవకుండానే లేచిపోయాడు. అంత డబ్బు ఎలా తేవాలీ అని ఆలోచించేలోగానే సినిమా కథని కాఫీ కొట్టి నట్టు నీరజ నాన్న, వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్ళిపోయేడు.

ప్రస్తుతం దినం గడవడానికి ఏదైనా ఉద్యోగం చేస్తే బావుణ్ణ నుకుంది. కాని దిక్కులేని దానికి ఉద్యోగం ఇచ్చి ఆదుకునేటంత దీనజనబంధులు మనకి లేరు.

ఆడపిల్ల, ఒంటరిగా వుంది, వయసులో ఉంది.

పైగా అవసరంలో వుంది.

మరంచేత ఆ ఊళ్ళో మొగాళ్ళకి కళ్ళు జిగేల్మన్నాయి.

ఒళ్లు జలజలలాడింది.

జుత్తు పండిన వాళ్ళు కూడా జత కలుపుదాం అనుకున్నారు.

మమ్మల్ని నమ్ముకో. నీ ఇల్లు, ఒళ్ళు బంగారంతో నింపేస్తాం అన్నారు కొంతమంది దయామయులైన మగవాళ్ళు.

తిండిలేక చావనైనా చస్తాను గాని మీకు లొంగనంది నీరజ

కాని పాపం ఆ మొగాళ్ళు ఆవిడని తిండిలేక చావనియ్యలేదు.

ఎప్పుడైనా ఆవిడకి నిరంజనం, పాతికవేలు జ్ఞాపకం వస్తే వెర్రినవ్వు నవ్వుతుంది.

(ఈ కథలో అసందర్భాలు వెతక్కండి. ఎంచేతంటారా? అసలు ఆడదాని జీవితమే ఒక పెద్ద అసందర్భం. నీరజని నిరంజనం మోసం చేసినా, లేక మరో అప్పలమ్మని అప్పారావు సినిమాలో చేర్పిస్తానని సిటీ తీసికెళ్ళి, కట్టుకున్న కోకతో సహా విప్పేసి నారాయణమ్మ కంపెనీకి నలభై రూపాయలకి అమ్మేసినా, పెళ్ళి చేసుకుంటానని పరాయివూరు తీసుకెళ్ళి నాల్నెల్ల కాపరం చేసి మూణ్ణెల్ల కడుపుతో కాకా హోటలు బెంచీమాద వదిలేసినా, ఈ కథలన్ని చేరేది మునిసిపల్ బండిలోకే. అన్ని కథలు ప్రారం భాలు వేరైనా అంతం ఒకటే.

❖ ❖ ❖

నీరజలాంటి వాళ్ళని పతిత అన్నారు ఆమె దగ్గరికెళ్ళే వాళ్ళతో సహా. పడుపు వృత్తి అన్నారు కడుపునిండిన వాళ్ళు.

సృష్టిలో ముందు ఆకలిపుట్టి, తరువాత ప్రాణి పుట్టింది. ఈ దోపిడీలు, హత్యలు, కుట్రలు, పోరాటాలు, దొంగతనాలు అన్నీ ఆకలి సృష్టించినవే.

"కోటి విద్యలూ కూటి కొరకే" అని కూడా మనవాళ్ళ న్నారు. మనిషి చేత ఎంతటి ఘోరం చేయించే శక్తి అయినా ఆకలికుంది. ప్రతి మనిషి ఆడ, మగ, చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ రోజుకి కనీసం ఓ పూటన్నా కడుపునిండా కాక పోయినా సగమైనా తినాలనుకోవడం కనీసపు కోరిక. ఆడది తన దగ్గర అమ్ము కోవడానికేం లేనప్పుడు తీసే వజ్రాయుధం శరీరం. అయితే కొంత మంది ఏ కారణం లేకుండా ఒళ్ళు అమ్ముకోవడం లేదా అనొచ్చు. అలాంటివాళ్ళు తక్కువ. ఉన్నా వాళ్ళ జోలికెవరూ పోలేనంత ఎత్తులోవుంటారు వాళ్ళు. అంచేత వాళ్ళ ప్రసక్తి అనవసరం.

ఆడది మగాడి దగ్గరకెళ్ళేది కడుపు కోసం. మగవాడు ఆడదానిదగ్గరికెళ్ళేది కేవలం స్వంత శరీర సుఖం కోసం. ఎంత కడుపు నిండితే అంత ఆడ ఆకలి మగాడికి.

మోటుగా చెప్తున్నందుకు క్షమించాలి.

ఆడదాన్ది "కడుపు వృత్తి". మగాడిది "పడుపు వృత్తి"

ఘోరనిజం చెప్పాలంటే ఆడది యుగయుగాల నుండి మొగాడికి కితకితలు పెట్టే 'కీ' బొమ్మ. ఆనాటి ఇంద్రసభలో కూడా రంభ, ఊర్వశి వగైరాలుండేవారు. "రాజు చేస్తే రసికత్వం, చాక లాడు చేస్తే రంకుతనం" అని అది స్వర్గం కాబట్టి వాళ్ళని అప్స రస లన్నారు. ఇది భూలోకం కాబట్టి వీళ్ళని 'పతిత'లని, 'వేశ్య' లని అంటున్నారు.

పూర్వం రాజుల కొలువులో రాజనర్తకులనీ, దేవాల యాల్లో దేవదాసీలని వుండేవారు. వీళ్ళ వృత్తి కేవలం రాజుగార్ని, దేవుణ్ని బాగులేనప్పుడు మురిపించడం, రాజు దగ్గరకొచ్చే గొప్పవాళ్ళనీ, దేవుడుదగ్గర కొచ్చే భక్తులనీ మరిపించడం. అయితే వాళ్ళు సామాన్య జనానికి అందుబాటులో వుండరు. మరంచేత ఏ స్టేజికి వెళ్ళిపోయే రంటే వీళ్ళందర్నీ ఓ కులం అన్నారు. వాళ్ళు పెళ్ళి చేసు కోవడానికి వీల్లేదు (పెళ్ళి చేసుకుంటే మగాళ్ళగతేం కావాలి?) వాళ్ళ పిల్లలకు తండ్రి వుండడు. వాళ్ళకి (ఎంత గొప్ప వాళ్ళకి పుట్టినప్పటికీ) సంఘములో గౌరవం, పరువు వగైరాలుండవు – ఇక్కడ సంఘం అంటే వాళ్ళ నాన్నలే.

అయ్యా, మీకింకో విషయం తెలుసా? ఒక మొగాణ్ని మరొక మొగాడు ఏ విధంగానూ ఓడించలేకపోయినప్పుడు సామదాన భేధ దండోపాయాలన్నీ విఫలమైనప్పుడు ఆఖరి అస్త్రంగా దేన్ని వదుల్తాడు? ఆఫ్టాల్ ఒక ఆడదాన్ని, మరిం ఈ బ్రహ్మాస్త్రానికి తిరుగులేద్సార్. అలనాడు అమృతాన్ని రాక్షసులు ఎత్తుకొనిపోతే దేవతలు వదిలింది ఒక ఆడదాన్ని.

ఏ మునీశ్వరుడో కఠోర తపస్సు చేసి ఇంద్ర పదవికి ఎసురు పెట్టినా, లేక మరోదేవుఁడికి ముప్పు రాబోయినా అంతటి దేవుడు వాడేది తన మందీ మార్బలాన్నీ కాదు, మారణాయుధాల్ని కాదు, కేవలం ఒక ఆడదాని అండతో.

ఇప్పటికీ మనవాళ్ళు పురాణాల అడుగుజాడల్ని అనుసరిస్తూ అన్ని లెవల్స్‌లోనూ ఆడదాన్ని వాడుకుంటున్న దాఖలాలున్నాయి మరి!

పతిత – పతివ్రత.

రెంటికి తేడా ఒక్క అక్షరం.

ఏకాక్షర నిఘంటువు తిరగేస్తే బహుశా ఆ అక్షరం అర్థం మొగాడు అని వుంటుందేమో!

ఆడదాన్ని పతితగా చేసినా, పతివ్రతగా చేసినా మొగాడే.

ఇద్దరి దగ్గరా మొగాడు తీసుకునేది ఒకటే.

ఇద్దరూ మగాడి మీద ఆధారపడినవాళ్ళే.

కాకపోతే ఒకరు టెంపరరీ, మరొకరు పెర్మనెంటు.

పతివ్రతలు లేకపోయినా ఫరవాలేదు కాని పతితలు లేకపోతే మగవాడు బతకలేడు మరి.

అంచేత అమ్మా! ఇది అనంతం !!!

**(జ్యోతి, 1980)**

# టెన్ కమాండ్‌మెంట్స్

పశువులన్నీ కులాసారా కబుర్లు చెప్పుకుంటూ ఆ వేళ జరిగిన వన్నీ నెమరు వేసుకుంటూ ఇళ్ళకెళుతున్నాయి.

పక్షులన్నీ అప్పుడే గూళ్ళకెళ్ళడం ఇష్టంలేక ఆ ఇంటి మీద, ఈ గోడమీద కూర్చుని ఆ వేళ విశేషాలు చెప్పుకుని నవ్వుకుం టున్నాయి.

"టైమెంతవుతుందో" అనుకుంది పార్వతమ్మ.

అయిదు అంది సాయంత్రపు సైరను.

"అమ్మబాబోయ్! అప్పుడే అయిదైపోయింది. ఇంకా ఏ పనీ తెవల్లేదు. సరోజని చూడ్డానికి పెళ్ళివారొస్తారు" కూడా అని హడావిడిగా అటు, ఇటు తిరిగేసి అందరికీ పన్లు పురమాయిం చేసింది.

పెళ్ళి వారు వచ్చేరు, వెళ్ళేరు.

"పిల్ల నచ్చలేదు. మరికొంచెం రంగుంటే...?"

మరో అయిదుగురు వచ్చేరు. వెళ్ళేరు.

వాళ్ళూ అదే అన్నారు.

నచ్చనిది, మరికొంచెం వుండాల్సింది రంగు కాదు.

కట్నం.

ఆఖరికి ఎలగైతేనేం ఆరోవాడు అమ్మాయికి మార్కులు ఎక్కువవేసి, కట్నం కొంత కన్సెనిచ్చాడు. కుర్రాడి మంచి తనాన్ని తెగ మెచ్చుకున్నారు. అమ్మాయి అదృష్టం అంతే లేదన్నారు. అమాంబాపతు అరవై వేలు ఖర్చయింది. పెళ్ళయిన పదిరోజు లకే అతను అమెరికా వెళ్ళిపోయేడు. పిల్లని తరువాత పంపమని, అధిక మాసవని, ఆషాడ మాసవని శ్రావణమాసం నోములని, మూఢం అనీ మొత్తానికో ఆర్నెల్లయినా పిల్లని పంపడం అవలేదు.

❖ ❖ ❖

తెల్లవారు ఝాము.

"టైమెంత అవుతుంది చెప్మా!" అనుకుంది మూడో అంత స్తులో పడుకున్న మాలతి.

"నాలుగు" అంది వెనకింటి వెంటేశంగారి కోడి, తను కుయ్యక పోతే వీళ్లెవరు లేవరో ఏవిటోనని.